తొలిపూజకు ఆహ్వానం



ఎంపీ ఈటలకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

పోచారం: అన్నోజిగూడలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద సూర్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వినాయక మంటపంలో తొలిపూజలో పాల్గొనాలని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఆహ్వానించారు. వినాయక చవితి రోజు నిర్వహించే ఈ పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అసోసియేషన్ అధ్యక్షుడు బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి సోమవారం అందజేశారు.

మట్టి గణపతిని పూజించాలి



కీసర: దమ్మాయిగూడ క్రాంతి కీన్స్ స్కూల్ విద్యార్థులు ప్రకృతి మిత్రంగా వినాయకచవితిని నిర్వహించుకున్నారు. సోమవారం క్రాంతి కీన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్యాణి, టీమ్ సభ్యులు కవిత, అల్తాఫ్, సంతోష్, సందీప్‌ల సహకారంతో విద్యార్థులు తమ చేతులతో మట్టి వినాయక విగ్రహాలను తయారుచేశారు. మట్టిగణపతి విగ్రహాలు, మొక్కలను పంపిణీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ కల్యాణి ప్రకటించారు. మట్టి విగ్రహాల వల్ల నీటి వనరులు, చెరువు కాలుష్యం కాకుండా ఉంటాయని, మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ఆమె కోరారు.

మట్టి గణపతుల పంపిణీ



కీసర: వినాయక చవితి సందర్భంగా జీనియా ఆసుపత్రి ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి కమిషనర్ వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన సూచించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జవహర్‌నగర్: ఇండో–నేపాల్ కరాటే చాంపియన్‌షిప్‌లో రణవీర్, శ్రేయాస్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మాస్టర్ రమేష్ శిక్షణలో పాల్గొన్న 11 మంది విద్యార్థులు 9 పసిడి పతకాలు, 2 రజతం సాధించారు. అనంతరం చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

వైద్య వృత్తి విలువైనది



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రీతిరెడ్డి

మేడ్చల్‌రూరల్: వైద్య వృత్తి ఎంతో విలువైందని, వైద్యంలో ఫిజియోథెరఫీ విభాగం ఆరోగ్యానికి అతి ముఖ్యమైన అంగం అని మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ డాక్టర్ ప్రీతిరెడ్డి అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఫిజియోథెరఫీ కోర్సు విద్యార్థుల ఓరియెంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థులకు పలు సూచనలు చేశారు. యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, రిజిస్ట్రార్ శ్రీనివాస్, డీన్ అపర్ణ, మహమ్మద్ రఫీ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లా డీవైఎఫ్ఐ నూతన కమిటీ

మేడ్చల్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా డీవైఎఫ్ఐ నూతన కమిటీని మేడ్చల్‌లో సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మన్నె ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా బొబ్బర శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కిరణ్, సహాయ కార్యదర్శులుగా నర్సింగ్‌రావు, నాగరాజు, కోశాధికారిగా చైతన్యరెడ్డి కమిటీ సభ్యులుగా బాలకిరణ్, రాజ్‌కుమార్, బ్రహ్మాజీ, అంజనేయులు, అనూషలను ఎన్నుకున్నారు.

క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి

మేడ్చల్: విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అన్యాయంపై నిలదీస్తే దుర్భాషలాడుతున్న మేడ్చల్ టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీఓ)పై జిల్లా అధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సీపీఎం మండల కార్యదర్శి నరేష్ నాయకులతో కలిసి టీపీఓపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

కలలు నెరవేరేదెన్నడో ?

- నిర్మాణం పూర్తయిన మత్స్య కళాశాల భవనం
- మూడేళ్లు గడిచినా ప్రారంభానికి నోచుకోని వైనం



నిరుపయోగంగా మత్స్య కళాశాల కోసం నిర్మించిన భవనం

మేడ్చల్: ఐదేళ్లుగా నిర్మిస్తున్న మత్స్యశాఖ భవనం పూర్తయినా పాలకుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. మేడ్చల్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో మత్స్య కళాశాల ప్రారంభించాలని భవనం మంజూరు చేసి, పనులు ప్రారంభించారు. నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు.

రూ.5.5 కోట్ల నిధులు

మేడ్చల్‌లోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్న అలంకరణ చేపపిల్లల కేంద్రంలో గత ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించేలా రూ.5.5 కోట్లు మత్స్య కళాశాలకు మంజూరు చేయగా భవనం నిర్మించారు.

మూడేళ్ల క్రితమే పూర్తి..

మూడేళ్ల క్రితమే భవన నిర్మాణం పూర్తయినా మత్స్య కళాశాల మాత్రం ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వం ఆక్వా రంగానికి ప్రాధాన్యతనిచ్చి ఆ దిశలో చేప పిల్లలు, ఇతర రకాల చేప పిల్లలపై పరిశోధనలు, అవగాహన, ఉత్పత్తి వంటి అంశాలపై 'బ్యాచులర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్' డిగ్రీకి మత్స్య కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు చేసింది.

☛ పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారికి కళాశాలలో అడ్మిషన్లు ఇచ్చి వారిని ఆక్వా రంగంలో నిష్ణాతులను చేయడం కళాశాల ఏర్పాటు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం నిర్మించిన భవనం వృథాగా మారిపోయింది.

కుంటను తలపిస్తున్న పరిసరాలు..

సువిశాల ప్రాంగణంలో ఉన్న భవనం పాలకుల నిర్లక్ష్యం కారణంగా వృథాగా ఉండిపోయింది. చెరువు కింద ఉండటంతో వర్షాకాలంలో భవన పరిసరాలు కుంటలా మారిపోతున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వరదనీరు పూర్తిగా భవనం చుట్టూ.. చేరి కుంటను తలపిస్తున్నాయి. జాతీయ రహదారి పక్కనే ఉండటం, జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండటంతో వర్షం కురిస్తే వరద నీరు బయటకు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో భవన పరిసర ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో దూరంగా ఉండిపోవాల్సి వస్తుంది.

మత్స్య కళాశాలను ప్రారంభించాలి



మత్స్యకారుల కోసం ఏర్పాటు చేయదలిచిన కళాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి. నేటి యువతకు ఎంతో ఉపయోగపడే ఈ కళాశాలను ప్రభుత్వం ప్రారంభిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. భవన నిర్మాణం పూర్తి కావడంతో అధికారులు తగిన మరమ్మతులు చేసి అన్ని రకాల వసతులతో కళాశాలను ప్రారంభించాలి.

– మల్లికార్జున్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు

మూడేళ్లయినా.. కనిపించని పురోగతి



మత్స్యకారుల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంచి ఆలోచనలు చేసి మత్స్య కళాశాల ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం దానిని ప్రారంభించడం లేదు. భవన నిర్మాణం పూర్తై మూడేళ్లయినా.. పాలకులు మాత్రం శ్రద్ధ చూపకపోవడం బాధాకరం. మత్స్య రంగానికి ఉపయోగపడే కళాశాలను వెంటనే ప్రారంభించాలి.

– సుదర్శన్, మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి

పర్యావరణాన్ని పరిరక్షించండి

జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఝాన్సీరాణి

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కుమ్మరి వృత్తి కళాకారులు మట్టి గణపతి ప్రతిమల తయారీలో శిక్షణ పొందారని, వారు మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీరాణి ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా అందరూ పర్యావరణ పరిరక్షణ కోసం కుమ్మరి వృత్తి కళాకారులు తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలను మాత్రమే పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. పర్యావరణం, స్వచ్ఛమైన పండుగ కోసం మట్టి వినాయకుడిని ఎంచుకుంటే భూమికి, భవిష్యత్‌తరాలకు మేలు చేసిన వారమవుతామన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

శామీర్‌పేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ జనరల్ మేనేజర్ ఎండీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 3 నెలల ఆర్థిక సమగ్రత సాంద్రీకరణ ప్రచారంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి వార్డులో కేంద్ర ప్రభుత్వ పథకాలపై బ్యాంక్ సిబ్బందితో అవగాహన కల్పిస్తామని వివరించారు. ఈ సమావేశానికి హాజరైన మహిళలు మరికొంత మందికి వివరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యూపీఐ నుంచి డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రూ.5.36 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఎల్‌డీఎం శివప్రసాద్, హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్‌నాయక్, రీజినల్ హెడ్ దిలీప్‌కుమార్, బనర్వాల్, ఆర్‌బీఐ ఏజీఎం రెహ్మాన్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వినాయక సాగర్‌ను పరిశీలించిన డీసీపీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ పద్మజారెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ

ఘట్‌కేసర్: ఏదులాబాద్ వినాయకసాగర్ (శ్రీ లక్ష్మీ నారాయణ చెరువు)ను రాచకొండ మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ పద్మజారెడ్డి సోమవారం నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి ఏటా నిమజ్జనం ఏర్పాట్లు, ఎన్ని.. ? విగ్రహాలు నిమజ్జనం చేస్తారో స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులు చెరువులోకి వెళ్లకుండా వాహనాలు రాకుండా భారీకేడ్లు ఏర్పాటు చేయాలని, నిమజ్జనం ముగిసే వరకు గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మల్కాజ్‌గిరి జోన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్లు బాలస్వామి, రాజుశర్మ, డీఐ శ్రీనివాస్, ఎస్సై సైదులు, నాయబ్ తహసీల్దార్ రాజేందర్, మున్సిపల్ మేనేజర్ సతీష్, ఆర్ఐ కావ్య, కందుల కుమార్‌ముదిరాజ్, రాజు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'సీపీఎస్' రద్దు హామీని అమలు చేయాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న జరిగే 'విద్రోహ దినం' చారిత్రాత్మకంగా నిలవాలని జిల్లా వ్యాప్తంగా ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పాల్గొనాలని టీఎస్జీఓస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్ పిలుపునిచ్చారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లోని టీపీ స్జీవోస్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. మాట తప్పే పరిస్థితి వస్తే ఉద్యోగులు తీవ్రమైన ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. పెన్షన్ అనేది ఉద్యోగుల న్యాయ సమ్మతమైన హక్కు, దానిని వంచనతో లాక్కోవడాన్ని ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1న కలెక్టర్ కార్యాలయం వద్ద నల్ల దుస్తులు ధరించి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. టీఎస్జీఓస్ జిల్లా నాయకులు భరత్‌కుమార్, నాగరాజ్, కలెక్టర్ యూనిట్ నాయకులు కార్తీక్, కిషోర్, లింగాల అక్షయ్‌కుమార్, చంద్రకాంత్, ఉమాకాంత్, వెంకటరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

తుమ్మ చెరువును పరిరక్షించాలని ఫిర్యాదు

మేడ్చల్: పట్టణంలోని ఊట చెరువు, తుమ్మ చెరువును కబ్జాల నుంచి కాపాడాలని బీజేపీ నేతలు ప్రజావాణిలో అధికారులను కోరారు. నియోజకవర్గ నాయకుడు సుదర్శన్‌రెడ్డి, పట్టణ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్‌లు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు తుమ్మ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను కాపాడాలని వినతి పత్రం అందజేశారు. కొంతమంది నేతలు అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసుకుని చెరువు స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని, దీనిపై పూర్తి విచారణ జరిపించి కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్యవైశ్యులు వ్యాపారాల్లో మరింతగా రాణించాలి

మేడ్చల్: నగర శివార్లలో వ్యాపారాలకు అనువైన ప్రాంతాలు ఉన్నాయని, వైశ్యులు అన్ని వ్యాపారాలపై దృష్టి సారించి వ్యాపారాల్లో మరింత ఎదగాలని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లింగా కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మేడ్చల్‌లో నిర్వహించిన గ్రేటర్ ఆర్యవైశ్య బిజినెస్ లీడర్స్ సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా 30 చాప్టర్‌లను ఏర్పాటు చేసి ఒక్కో చాప్టర్‌లో రెండు వేలమందిని ఏర్పాటు చేసి వైశ్యులను వ్యాపారంగంలో అభివృద్ధి చేస్తామన్నారు. జీవీబీఎల్ సీఈఓ రాజశేఖర్, వైశ్య సంఘం నాయకులు క్రాంతికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కృషితో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

పోచారం: విద్యార్థులు ఇష్టమైన రంగంలో రాణించాలంటే దాదాపు 25 ఏళ్లు కృషి చేయాల్సి ఉంటుందని డీసీపీ పద్మజ అన్నారు. సోమవారం ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ తరగతి గదులను ఆమె ప్రారంభించి, పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లడుతూ.. నిర్విరామ కృషితోనే ఎంపిక చేసుకున్న రంగంలో రాణించవచ్చన్నారు. స్కూల్‌లో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, ఏసీపీ చక్రపాణి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ నేత బద్దం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని మేడ్చల్ పెద్దచెరువు వద్ద నీటిలో ఓ మృతదేహం తేలియాడుతుందని స్థానికులు గుర్తించి మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతిచెందిన వ్యక్తి తెల్లటి రంగు షర్ట్ ధరించాడని, సుమారు 45 ఏళ్లు ఉంటాయన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

శామీర్‌పేట చెరువులో మరో వ్యక్తి..

శామీర్‌పేట్: పెద్ద చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం శామీర్‌పేట చెరువులో వ్యక్తి మృతదేహం తేలియాడుతున్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించగా.. షాపూర్‌నగర్‌కు చెందిన రామకృష్ణారెడ్డి(43)గా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. సోదరి విజయలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని ధ్రువీకరించారు. భార్యాపిల్లలకు అతడికి దూరంగా ఉంటున్నారని ఈ కారణంతోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు శామీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో 95 ఫిర్యాదులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ)రాధికా గుప్తా ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు, బస్తీల నుంచి వచ్చిన ప్రజలు 95 ఫిర్యాదులతో కూడిన దరఖాస్తులను అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలకు ఓర్చుకుని తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. తిరస్కరించే దరఖాస్తులకు గల కారణాలను తప్పనిసరిగా అర్జీదారులకు తెలపాలని అధికారులకు ఆమె సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీపై కలెక్టరేట్‌కు రైతులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసేంత వరకు పొరాటాన్ని ఆపబోమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు , మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఘట్‌కేసర్ నుంచి మేడ్చల్ కలెక్టరేట్ వరకు రైతులు తమ సొంత వాహనాల్లో తరలివచ్చారు. రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ మను చౌదరిని కలిసేందుకు రైతులు తరలిరాగా.. ప్రధాన గేట్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. రైతులకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నప్పటికీ, ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1200 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

☛ ఘట్‌కేసర్ మండలంలోని 1889 మంది రైతులకు రూ.9 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద రైతులు కొద్దిసేపు బైఠాయించి, ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసుల అనుమతితో ఐదుగురు రైతులు మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి రుణమాఫీపై వినతిపత్రం అందజేశారు. రైతులు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, గౌరీశంకర్, రైతు నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

కలెక్టరేట్ వద్ద సీపీఎం ధర్నాలో రాష్ట్ర నేత పాలడుగు భాస్కర్



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

సాక్షి,మేడ్చల్ జిల్లా : ప్రభుత్వం 6 గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పాలడుగు భాస్కర్ అన్నారు. సోమవారం సీపీఎం పార్టీ మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం నేత పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సొంత నిధులతో డబుల్ బెడ్రూం ఇళ్లల్లో మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేటాయించిన ఇళ్ల కాలనీల్లో తాగునీరు, రవాణా సౌకర్యం లేదని, మిగిలిన ఇళ్లను వెంటనే అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే గత సీఎంలను గద్దె దించినట్టే, ప్రస్తుత సీఎంపై పోరాటం చేస్తామన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.రమ, జిల్లా కార్యదర్శి సత్యం, సీపీఎం జిల్లా నాయకులు చంద్రశేఖర్, అశోక్, రాజశేఖర్, శ్రీనివాస్, రాథోడ్ సంతోష్, నరేష్, లింగస్వామి, లక్ష్మణ్, శంకర్, వెంకన్న, వివిధ మండలాల నాయకులు గణేష్, నర్సింగ్‌రావు, కిష్టప్ప, ఆంజనేయులు, మంగ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అక్రమంగా పశువులు తరలిస్తున్న వారిపై కేసు

జియాగూడ గోశాలకు తరలించిన పోలీసులు

ఘట్‌కేసర్: అక్రమంగా పశువులు తరలిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. (ఏపీ39యూజీ–2596) అశోక్ లీలాండ్ (గూడ్స్ కారేజీ) అనుమానాస్పదంగా కనిపించడంతో పాటు పారిపోయేందుకు యత్నించగా.. వాహనాన్ని అడ్డుకున్నామన్నారు. వాహనంలో పరిశీలించగా 9 ఆడ దూడలు, 4 మగ దూడలు కనిపించాయన్నారు. వాహనంలో ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. డ్రైవర్ దండ మహేష్ (35), క్లీనర్ సాయిరాం శ్రీను(38), సురేంద్ర (25)గా తేలింది. ఆంధ్రప్రదేశ్ తుని సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. వాహనం సీజ్ చేసి పశువులను నగరంలోని జియాగూడ గోశాలకు తరలించామన్నారు. ఈ మేరకు పశువులను క్రూరంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లలో మౌలిక వసతులకు కృషి



మురహరిపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద కలెక్టర్ మను చౌదరి అధికారులు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

శామీర్‌పేట్: డబుల్ బెడ్రూం ఇళ్లలో మౌలిక వసతుల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సోమవారం అలియబాద్ మున్సిపాలిటీ, మురహరిపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం(అపార్ట్ మెంట్)ల ప్రాంతాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లకు సరిపడా తాగునీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అటవీశాఖ అనుమతుల్లో కొంత మేర జాప్యం జరుగుతున్నందున పరిపాలన అనుమతులకు ఉన్నతాధికారులను సంప్రదించి సత్వరమే పరిష్కారించాలని అటవీ, మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. డబుల్ ఇళ్ల అపార్ట్‌మెంట్‌కు ప్రహరీ నిర్మించాలని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నిర్మాణ నివేదికను తయారు చేసి సమర్పించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ పీడీ రమణామూర్తి, శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని పరిరక్షించాలని ధర్నా



నాగారం మున్సిపల్ కార్యాలయం ఎదుట . ధర్నా చేస్తున్న స్థానిక నేతలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణనగర్ కాలనీలో ఉన్న ఆలయ స్థలాన్ని కాపాడాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట కాలనీ వాసులు, బీజేపీ నేతలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. రామకృష్ణానగర్ కాలనీలోని సర్వే నెంబర్–64,66,74,75,76,77లోని జీపీ లేఅవుట్‌లో ప్లాట్లు చేసి ఆలయ నిర్మాణానికి 1455 గజాల స్థలాన్ని కేటాయించగా.. 400 చదరపు గజాల స్థలంలో ఆలయాన్ని నిర్మించగా.. మిగిలిన స్థలం ఖాళీగా ఉందన్నారు. మిగిలిన స్థలంలో అధికారులు అనేకసార్లు ఆక్రమణలను కూల్చివేశారని, కానీ ఇప్పుడు కబ్జాదారులకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆలయ స్థలంతో పాటు రోడ్లు, పార్కు స్థలాలు కూడా ఆక్రమణకు గురౌతున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే ఆలయ స్థలంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కొకుట్ల రాహుల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణయాదవ్, యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.